# పెళ్లి

రామారావు చేసిన పని నాకు నచ్చింది. ఈ పని అతగాడు ఏనాడో చేసి వుండవలసింది.

తండ్రి యజ్ఞన్నశాస్త్రి మూడుకాళ్ళముసలి. సహస్రచంద్రదర్శనం కూడా చేసుకున్నవాడు. ఎక్కువకాలం మంచంమీదనో, వాలు కుర్చీలోనో గడిపేస్తున్నాడు. పూర్వపు పటుత్వం లేకపోయినా తన పనులు తాను చేసుకోగలడు. ఎనభయ్యయిదేళ్ళ వయసులో అక్కడికది గొప్పేకదూ.

రామారావుకు కళ్లెం వేసినవాడు తండ్రి యజ్ఞన్న శాస్త్రే. సహజంగానే ముసలాయన పూర్వాచార పరాయణుడు. ఛాందసుడూను. తండ్రిని కాదని ఈ పని చెయ్యడానికి రామారావుకు మొదట్లో ధైర్యం చాలలేదు. నా వంటి శ్రేయోభిలాషులైన మిత్రులు పోరుపెట్టగా, సహకరించగా, చివరికి ధైర్యం చేశాడు.

సంగతంతా పూర్తిగా తెలిసినవాళ్ళు చాలా సంతోషించారు. ఇవ్వాళ మనకు దేశంలో రామారావువలె–తెగించి ముందుకు నడిచేవాళ్ళు కావాలి.

అతని సంగతి చెప్పడం ప్రారంభిస్తే ఇదంతా పాతకధే కదా అనిపించవచ్చు–కాని ఆ కథ తుదిమలుపు మాత్రం–అతని గెలుపు.

యజ్ఞన్నశాస్త్రికి గల పదకొండుగురు సంతానంలోనూ–బాలారిష్టాలుదాటి బ్రతికి బట్ట కట్టినవాళ్ళు అయిదుగురంటే అయిదుగురే. యజ్ఞాలుచేశాడు, శాంతులూ చేశాడు. అతని భార్య పూజలూ, పునస్కారాలూ, నోములూ వ్రతాలూ చాలా చేసింది. సంతానం మాత్రం–అంతవరకే దక్కారు. మిగిలినవాళ్ళలో రామారావు పెద్దవాడు. కడగొట్టుది రమామణి. ఆయన షష్టిపూర్తికి సరిగ్గా నెలరోజులు ముందు పుట్టింది. పుట్టడానికి మొత్తం నలుగురు ఆడపిల్లలు పుట్టినా–కడకు మిగిలింది ఒకర్తె. నలుగురన్నలకు ఒక్క చెల్లెలు. అన్నం తింటే అరిగిపోతుందేమో, కాటుక పెడితే కందిపోతుందేమోనన్నంత అల్లారు ముద్దుగా పెంచారు. హైస్కూలుచదువు పూర్తి చేసింది. అక్కడితో ఆపుచేసింది. ఆమె చదువుతాననలేదు. ఇంకా చదవమని ఎవరూ చెప్పనూలేదు.

భార్య అనారోగ్యం యజ్ఞన్నశాస్త్రి ఆర్థిక పరిస్థితిని క్రుంగ దీసింది. అతని సమస్త శక్తుల్నీ పిండేసింది. ఇల్లు నిత్య నరకమే. మనశ్శాంతి లేనేలేదు. కాగా అతనిది క్రమబద్ధమైన సంపాదన కాదు. సంపాదనలో ఎక్కువ భాగం భార్య ఇంగ్లీషు మందులకే పొయ్యవలసి వచ్చేది. ఇంత అనారోగ్యంలోనూ ఆమె పదకొండు పురుళ్ళు పోసుకుంది. అందరికీ అదే ఆశ్చర్యం బాగుంటే అరవయి పురుళ్ళు పోసుకున్నా– అని సోమదేవమ్మ వేళాకోళం చేస్తుంటుంది.

ఇన్ని ఇబ్బందుల్లోనూ శాస్త్రి–కొడుకులకు పెద్ద చదువులు చెప్పించాడు, కష్టంగానే. అందరూ ప్రయోజకులయ్యారు. తలా ఒకచోట గౌరవంగా ఉద్యోగాలు చేసుకుని బ్రతుకుతున్నారు. పెద్దవాడు రామారావు ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ తండ్రినీ, తల్లినీ కనిపెట్టుకుని వున్నాడు.

యజ్ఞన్నశాస్త్రి–ఎనభయ్యోయేట ఉన్నకొద్ది పాటి మడిచెక్కా అమ్మి చిల్లర అప్పులు తీర్చి మిగిలిన సొమ్ముకు కొడుకులిచ్చిన సొమ్ముతోడుకాగా– ఏకైక కుమార్తెకు ఉన్నంతలో వైభవంగా వివాహం జరిపించాడు. 15 వేల కట్నం. అయిదు తులాల బంగారం, (వంటినివున్న రెండున్నర తులాలు కాక) లాంఛనాలు .......మరి భోజనాది ఇతర సవాలక్ష ఖర్చులు వుండనే ఉన్నాయి. నలభయి వేలకు పైగా ఖర్చు తేలింది. అది అతని తాహతుకు ఎక్కువే. అతని పూర్వపు ఆలోచనల ప్రకారమూ అయితే

...వేలంటే తరతరాల కూర్చుని తినవలసిన సొమ్ము!

ఆస్తులు అమ్ముకుని అట్టహాసంచేయకపోతే నేమి, క్లుప్తంగా తేల్చుకూడదా- అంటాడు పెద్ద కొడుకు రామారావు. ఉన్నది ఒక్కగానొక్క ఆడపిల్లకదా వైభవంగా జరగవలసిందే. అంటుంది ఇంటి యిల్లాలు.

పెళ్ళికొడుకు సోమనాధం- ఒక గుమస్తా. మెట్రిక్ నాలుగు వాయిదాల్లోనూ, ఇంటర్మీడియెట్ రెండువాయిదాల్లోనూ, టైపు లోయరూ హయ్యరూ ఒక్కొక్క వాయిదాలోనూ పాసయ్యాడు. గర్నమెంటుద్యోగం వచ్చింది. అదృష్టమే, అతనిదికాదు, పిల్ల నిచ్చుకున్నవాళ్ళదీ, పిల్లదానిదీ కూడానూ.

"పాతిక వేలిస్తామంటూ తిరుగుతున్నారు బావగారూ- ఏదో సంప్రదాయమైన కుటుంబం కదా అనీ, కలిసిన సమ్మంధం కదా అనీ-" నసిగాడు వియ్యంకుడు.

"మీరు లాంచనాలు ఎలాగూ లోటు చెయ్యరనుకోండీ-". అని మాటకలిపాడు.

ఈ పిల్ల నమలడాలూ, ఈ నాన్పుళ్ళూ, నాలిముచ్చు మాటలూ, దెప్పడాలూ, దీర్ఘాలు తియ్యడాలూ అంటే రామారావుకు వళ్ళుమంట.

"సూటుబూటూ దేనికీ- ఇంటర్మీడియెట్ చదువుకి, గుమస్తా ఉద్యోగానాకీను? చేసే దేమన్నా పెద్దగెజిటెడ్ ఆఫీసరుద్యోగమా ఏమన్నానా? ఎంకాం పాసయి పెద్దకంపెనీలో ఎకౌంటెంటుగాపనిచేస్తున్న నాకేలేదు సూటు" అని మండిపడ్డాడు.

"వేషానికి చదువుకి ఉద్యోగానికి సంబంధం లేదన్నయ్యా- నీకుమాత్రం తెలియదా ఏమిటి? సంతకంతప్పు చేతకాని దద్దమ్మలు వేసుకుంటున్నారు కోట్లు......" అని సర్దిచెప్పాడు సుబ్రమణ్యం.

"పెళ్లి మన అవసరం అన్నయ్యా నువ్వు ఆవేశపడకు" అన్నాడు చిన్నవాడు చిదంబరం అతడికీ ఈ వ్యవహారం చాలామంటగానే వుంది.

"వాళ్ళకా హోదావుందనికాదు లాంచనాలు కోరడం- వీలయినంత ఎక్కువగా రాబట్టుకుందామనీ...." అన్నాడు మేనమామ.

"అది నీచంకాదూ? దేబిరి గొట్టుతనం కక్కూర్తీకాదూ? అలాంటి గుణాలుచూస్తే నాకెంత అసహ్యమో" అని ఛీదరించుకున్నాడు రామారావు.

పెళ్లికొడుకు గీరా, దర్జా, పోజులూ చూస్తూంటే- వళ్లు ఉడికిపోయింది. ఎందుకూ అంతంత ఖరీదయిన సిగరెట్లు తాగడం? అంతేసి ఖరీదయిన బట్టలెందకూ? స్తోమతకుమించిన షోకులెందుకో-?'

లాంఛనాలదగ్గర ఆడంగుల గడుసుతనం చూస్తే- కంపరంపుట్టక మానదు. వాచీ వుండనేవుంది చేతికి. మళ్లీవాచీదేనికీ? ఉంగరంట! డ్రస్సింగ్ టేబుల్ ఫోమ్‌బెడ్ ముందు అనుకున్నదేనట! సీలింగ్‌ఫాన్‌చాలట! ఇవన్నీ అమ్మాయి సుఖంకోసమేనట!

తండ్రి వీటన్నిటికీ ఎందుకీప్పుకున్నాడనేది రామారావుకు మరీ కోపంగావుంది. కష్టంగానూ వుంది. ఇదేమీ లంచాలుతీసుకుని సంపాదించినసొమ్ముకాదు- కష్టార్జితం- పెళ్లిళ్లు అందరూ చేసుకుంటున్నారు మరీ యింతదోపిడీనా?

ఫెళఫెళలాడుతూ జరిగిపోయింది పెళ్లి!

సోమనాధం సంగతులు ఒకటీ ఒకటీ బయటపడుతున్నాయి. అతని జీతం. నిజం చెప్పాలంటే, సిగరెట్లకీ సాదరుకీ చాలదు. రోజా "మందు" వుంటే తప్ప పొద్దుగడవదు ఈ సుగుణాలన్నీ అతని స్నేహితులవల్లా, అతను పనిచేస్తున్న పరిస్థితుల వలయంవల్లా తీరూ దారీ లేని " నాగరికత" వల్లా సంక్రమించాయి.

ఇవికాక పై సరదాల సంగతి:

"వెరయిటీ లేని వెధవ జీవితం ఎందుకు?"

–అనేది సోమనాధం సూటి ప్రశ్న.

చూస్తూ చూస్తూ వుండగానే రమామణి నగలు దాదాపు అన్నీ కరిగిపోయాయి. ఉన్న కాస్తడబ్బూ దస్కం తరిగిపోయింది. కలహాలు, కలతలూ పెరిగిపోయాయి. ఇదంతా మొదటి మేరేజి డేకి ముందే!

ప్రేమాభిమానాలు, అనురాగాలూ, సర్వం అబద్ధమనీ, వాటి అన్నిటికీ మూలం ఆర్థిక సంబంధమేననీ– అనుభవ పూర్వకంగా చాలా గట్టిగా బోధ పడిపోయింది రమామణికి.

"స్కూటరు కొనిపిస్తావా ఛస్తావా" అని సోమనాధం తాజా డిమాండ్, కొత్త కోరిక.

నిత్య నరకంలా రోజులు వెళ్ళదీస్తోంది రమామణి. ఒకసారి పుట్టింటికి వచ్చినపుడు మెళ్ళో గిల్టు మంగళసూత్రం గమనించి ఇదేమిటిదని తల్లి అడిగింది. గుడ్ల నీళ్ళు గుండెల్లో కుక్కుకుని ఏడుపు ముఖం పెట్టింది. ఏమని చెప్తుంది?

ఇలాంటివి చాలా చాలా జరిగాయి. నేను ఇలాంటివి పేపర్లో చదివాను గాని– రామారావు చెప్తుంటే విన్నప్పుడు నా మనసు మరింతగా బాధపడింది. కళ్ళారా చూసినపుడు రక్తం కుతకుత లాడిపోయింది. కోపంతో అసహ్యంతో..... అసహనంతో మరిగిపోయేను.

ఆరోజు నేనూ. రామారావూ వీధి వరండాలో కూచుని మాట్లాడుకుంటున్నాం. ఉదయం తొమ్మిది దాటింది. ఆకాశవాణి నుంచి అందమైన సినీమా సంగీతం వినిపిస్తోంది. ఇంటి ముందు ఆటోరిక్షా ఆగింది. చావు దెబ్బలుతిని, పుట్టెడు దుఃఖం ఒడి గట్టుకుని పుట్టింటికి వచ్చింది రమామణి. ఆ తరువాత మరి మెట్టినింటికి వెళ్ళలేదు.

ఆ అమ్మాయి నా కళ్ళ ముందే పుట్టింది. పెరిగి పెద్దదయింది. అంత పెను దుఃఖం ఆమె ముఖంలో నేనెన్నడూ చూడలేదు. ఆ మాటకొస్తే ఏ ఆడదాని ముఖంలోనూ చూడలేదు. ఉరిశిక్ష పడినవాళ్ళ ముఖంలో కూడా అంత దుఃఖం వుండదు, గుండెలు తోడేసినట్టయింది. ఎవరో కడుపులో చెయ్యి పెట్టి దేవేసినట్టయింది.

ఇంకా నయమే. ఏ కిరసనాయిలో పోసి ముట్టించి చంపలేదు.

రమామణి రామారావు చెల్లెలా నా చెల్లెలా అన్నది ముఖ్యంకాదు. ఆమె దారుణ నరకయాతన పడుతుందనేది ముఖ్యం. ఆమె సమస్యకు వీలయినంత త్వర్లో పరిష్కారం ఆలోచించాలన్నది మరీమరీ ముఖ్యం.

రామారావూ, నేనూ, సుబ్బారావూ, నాగభూషణం, సింహాచలం, స్వాములూ- అందరం ఒక ఈడు వాళ్ళమే. ఒకటో తరగతి నుంచి స్కూలు ఫైనల్ వరకూ కలిసే చదువుకున్నాం. సింహాచలం వ్యాపారంలోకి దిగాడు. నాగభూషణానికి ఢిల్లీలో మంచి ఉద్యోగం వచ్చింది. మిగతా వాళ్ళం సామాన్య ఉద్యోగాలు చేస్తూ సంసారాలు వెళ్ళదీస్తున్నాం. ఏడాదికొకసారయినా అందరం కలుస్తాం. చిన్నప్పటి స్నేహమూ ఆపేక్షా– ఒకరిమీద ఒకరికి ఇప్పటికీ యధాప్రకారంగా వున్నాయని ధైర్యంగా చెప్పగలను. ఆ సాయంత్రం నేనూ, రామారావూ సుబ్బారావుని కలిసి– సింహాచలం దగ్గిరికి వెళ్ళాం.

రమామణి సమస్య– మా నలుగురి సమస్యాను. ఆమె కష్టం మా నలుగురి కష్టమూను. రాత్రి చాలా పొద్దుపోయేవరకూ తలకాయలు పగలగొట్టుకున్నాం. సమస్యలు స్నేహానికి గీటురాళ్ళు. ఆ గీటురాయిని జీవితం అనో, కాలం అనో అనండి. దానిమీద మా స్నేహపు గీతలు తళతళా మెరుస్తూనేవున్నాయి. వుంటాయి.

కర్తవ్యం ఆలోచించుకున్న కొద్దిరోజుల్లో కునుకునక్కపై తాటికాయ పడింది. రమామణి నెలతప్పిందని తెలిసింది. రామారావు చాలా ఆందోళన పడ్డాడు. ఈ సంగతి ఇంట్లో చెప్పనివ్వద్దని చెప్పాను. బంధువుల ఇంటికి వెళ్ళివచ్చే వంకను ఆమెను మా ఇంటికి రప్పించి- మా ఫామిలీ డాక్టర్ మనోరమచేత ఎబార్షన్ చేయించాను. సులువుగానే జరిగిపోయింది, ప్రారంభంలోనే మేలుకున్న కారణంచేత. రమామణి కోరిక మీదనే ఇలా చేశాను.

ఈ సంగతి చివరివాడు చిదంబరానికి తెలిసింది. "ఇన్నాళ్లూ నాకెందుకు చెప్పలేదన్నయ్యా. ఆ సోమనాథంగాడిని- సాక్ష్యమూ, రుజువూకూడా లేకుండా కూనీచేసేసివుండేవాడిని" అన్నాడు రామారావుతో. చిదంబరం ఆవేశం ఎటువంటిదో నాకూ తెలుసు.

రామారావుకు మనసులో చాలా పిరికిగా వుంది. పరిస్థితులు ధైర్యాన్ని మప్పుతున్నాయి గాని- ముందుకు సాగడానికి జంకుగా వుంది.

తరువాత కథ క్లుప్తంగా చెప్పేస్తాను.

సమానత్వం- ఎక్కడన్నా వుండొచ్చుగాని న్యాయశాస్త్రంలో, చట్టాల్లో లేదుగాక లేదు లేదని నాకు మొదటిసారి తెలిసిపోయింది.

నేనూ రామారావూ లాయర్ల చుట్టూ తెగతిరిగాం. అతనితోపాటు సహాయంగా నేను కోర్టులకు వెళ్ళాను. నేరాలు ఎరగని అమాయకులకు నేరాలు చెయ్యడం కోర్టులే నేర్పుతాయి. ఏనాడూ అబద్ధం ఆడనివాడిచేత పచ్చి అబద్ధాలు చెప్పకతప్పని పరిస్థితులు కోర్టులే కల్పిస్తాయి. రమామణి కోర్టువెంట తిరగవలసి వచ్చింది. చెయ్యని నేరానికి, వెయ్యనిశిక్ష అనుభవించింది. ఏ ఆడపిల్లయినా నలుగురులోనూ, కోర్టుకువచ్చి బోనెక్కి నిలబడాలనుకోదు! నాలుగేళ్లపాటు తిరిగి తిరిగి ప్రాణం విసిగింది. ఇంతాచేస్తే నేను గట్టుమీదవుండి సలహాలిచ్చేవాడినే కాని- నీటిలో నానుతున్న వాడిని కాను. అయినా నాకాకష్టం అర్థం అవుతూనే వుంది.

యజ్ఞన్నశాస్త్రి అంత వృద్ధాప్యంలోనూ చాలా నిష్ఠగా కూతురి జీవితం బాగుపడాలని పూజలూ, శాంతులూ చేస్తున్నాడు. తండ్రి తనకోసం చేస్తున్న తతంగం ఏదీ తన కష్టాన్ని ఆవగింజపాటి కూడా తొలగించలేదని రమామణికి తెలిసిపోయింది.

చివరికి-ఆమెకు "వరప్రసాదం" వంటి విడాకుల పత్రం వచ్చింది. చట్టం ప్రకారం ఆమెకు "న్యాయం" జరిగింది. (ఆమెకు జరిగిన తీరని అన్యాయం గురించి ఎవ్వడూ పట్టించుకోడేమిటి?) కట్నం ఎలాగూ పోయింది. నగలు తిరిగి వచ్చేవికావు. పేరుకు మిగిలిన "మంగళ" సూత్రం కూడా గిల్టుదే. పోనీ, పోతే పోనీ. మనోవర్తికూడా నాకక్కర్లేదని విడిగా పత్రం రాసిచ్చేసింది.

"పోనీ పోనీ- పీడవిరగడయిపోనీ!" అని మెటికలు విరిచింది. పవిత్ర భారతనారీమణి- రమామణి- ఎంతగా విసిగి వేసారిపోయిందో! శీలం గురించీ- పాతివ్రత్యం గురించీ (లేక దాంపత్య జీవితంలో కేవలం ఆడదాని నిజాయితీ గురించీ) సాహిత్యంలో, సినిమాల్లో వున్న అబద్ధాలు, కల్పనలు ఎప్పటికైనా తొలగించగలమా? నిత్య జీవితంలో అవి కబుర్లే తప్ప- ఎంత మాత్రం నిజంకాదని గుర్తించే ధైర్యం ఎప్పటికొస్తుంది మనకి?

మరొక రెండువాయిదాల్లో కేసు తేలిపోతుందనగా - రామారావు మాటలెలావున్నాయో వినండి మీరుకూడా-

"ఈ సంఘం, ఈ చట్టం, ఈ వ్యవస్థ- అసలీరాజ్యాంగం మొత్తం మారిపోవాలి- ఇది కలవాళ్ళూ, కడుపునిండిన వాళ్ళు స్వప్రయోజనం కోసం తయారుచేసింది. పులి కంకణం చూపి ఊబిలో దించినట్టు,

రుణసహాయం... వగైరా ఆకర్షణలు చూపుతోంది ఈ ప్రభుత్వం, మొత్తంగా హోల్ మొత్తంగా ఇదంతా దగా దగా-"

ఏ పుస్తకాల్లోనో చదివీ, రాజకీయ మీటింగులకు వెళ్ళీ నేర్చుకున్న మాటలుకావివి. రామారావెన్నడూ పేపరు చదవగా కూడా నేను చూడలేదు. జీవితంలోని గడ్డు వాస్తవిక తలే అతనికి నిజాన్ని నగ్నంగా చూపించాయి. చేతులు కాలితేనేకదా ఎవరికైనా చైతన్యం వచ్చేది.

విడాకుల పత్రం పుచ్చుకుని సంతోషంగా ఇంటికి వచ్చిన నాటిరాత్రి– రమామణి ఎంతగా ఏడ్చింది!

ఇక చివరిమలుపు కూడా చిత్తగించండి. ఇది జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు.

రామారావు తన చెల్లెలు బ్రతుకు బాగుపడటానికి ఏ పనయినా చెయ్యాలన్నంత తెగింపుకి వచ్చాడు. ఒక్క ఆడపిల్లకు దారి చూపగలిగినా మంచిదేకదా– అని నేనాలోచించాను.

నాలుగు నెలలు నలిగిన తరువాత మొత్తానికి–

మా ఆఫీసులో ఒక టైపిస్టుకీ రమామణికీ పెళ్ళి జరిగింది. (ఆ టైపిస్టు తక్కువకులం వాడని విన్న యజ్ఞన్నశాస్త్రి ప్రాయోపవేశం చేసేసుకుంటానని లేచాడు....) కట్నం లేదు. మంత్రం తంత్రంలేదు. కనీసం టీ పార్టీ మొదలైన అట్టహాసం కూడా బాగా తక్కువే. రిజిస్టరు మేరేజి కూడా కాదు కాయితాలమీద వున్న ఈ రూల్సంటే రామారావుకు వొళ్లుమంట. మనుషులలో, మనసులలో లేని నిజాయితీ కాయితాలలోంచి వస్తుందా? అంటాడు.

మరయితే అటు సంప్రదాయపు పెళ్ళికాక, "అభ్యుదయ" పెళ్ళికాక– ఇది ఎటువంటి పెళ్ళి అంటారా?

కులం మతం ప్రసక్తిలేని పెళ్ళి. ఆదర్శవంతమైన పెళ్లి.

వాగ్దానాలూ ప్రమాణస్వీకారాలూ, దండలూ దండుగలూలేని పెళ్ళి. దంపతులతో సహా ఇరవైమంది మాత్రమే హాజరయిన పెళ్ళి. ఏ ప్రభుత్వచట్టాలూ, న్యాయసూత్రాలూ నిర్వచించలేనంత ఉన్నతమైన పెళ్ళి.

బుద్ధిగలవారెవరయినా, సుఖపడదామనుకునే వారెవరైనా చేసుకోదగినంత చక్కని పద్ధతిలో జరిగిన పెళ్ళి.

జీవితాలు దుఃఖమయం చేసుకుంటూ, పిరికి తనంతో నిత్యం నరకం అనుభవించే ఆడవారికి రమామణి కథ– సరయిన పాఠం!

*రచన : డిసెంబర్ 1984*

*ప్రచురణ : పల్లకి, 11-4-1985.*